నమస్తే తెలంగాణ

# సూర్యాపేట

5 | నల్లగొండ, మంగళవారం 16 జూలై 2024 | SURYAPET




గిరి ప్రదక్షిణలో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఆలయ అధికారులు, భక్తులు

## యాదగిరి గుట్టలో గిరి ప్రదక్షిణ

యాదగిరిగుట్ట, జూలై15 : నరసింహ స్వామి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా యాదగిరి గుట్ట దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం సామూహిక గిరి ప్రదర్శన నిర్వహించారు. ఉదయం 6.05 గంటలకు వైకుంఠ ద్వారం వద్ద ప్రారంభమైన గిరి ప్రదక్షిణలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, అనువంశిక ధర్మకర్త బి. నరసింహ మూర్తి, ఈఓ భాస్కర్‌రావుతోపాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కొండచుట్టూ కాలినడక పాదయాత్ర చేపట్టారు. అనంతరం కొండపైకి వెళ్లి స్వామివారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.



నార్కట్‌పల్లి : బీఆర్‌ఎస్‌వీ నాయకులను ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు

# అరెస్టులతో అడ్డగింత

## ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిరుద్యోగుల అరెస్టు

### విద్యార్థి, యువజన సంఘాల నేతలనూ స్టేషన్‌లోనే..

- రోజంతా నిర్బంధం
- సచివాలయం ముట్టడికి వెళ్లకుండా కట్టడి
- సర్కారు తీరుపై మండిపడ్డ నిరుద్యోగులు

నల్లగొండ ప్రతినిధి, జూలై 15 (నమస్తే తెలంగాణ) : నిరుద్యోగుల సచివాలయం ముట్టడి కార్యక్రమంపై పోలీసులు నిర్బంధకాండను అమలు చేశారు. నిరుద్యోగులు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు సెక్రటేరియట్ వరకూ చేరుకోకుండా ఆదివారం అర్ధరాత్రి నుంచే అరెస్టుల పర్వం కొనసాగించారు. ఉద్యోగాల జాబ్ క్యాలెండర్ విడుదలతోపాటు ఏటా రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, మెగా డీఎస్సీ ప్రకటన, ప్రస్తుత డీఎస్సీ, గ్రూప్2 వాయిదా, గ్రూప్-2,3 పోస్టుల పెంపు, గ్రూప్-1లో 1:100 నిష్పత్తిలో ఎంపిక డిమాండ్లతో నిరుద్యోగులు సోమవారం చలో సెక్రటేరిట్ కార్యక్రమానికి సిద్ధమయ్యారు. కాగా, కార్యక్రమాన్ని ఫెయిల్ చేసేందుకు ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా పోలీసులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు. నిరుద్యోగులతోపాటు ఈ పోరాటంలో కీలకంగా ఉన్న యువజన సంఘాల నేతలను, ముఖ్యంగా బీఆర్‌ఎస్‌వీ నేతలు, కార్యకర్తలను ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. సోమవారం తెల్లవారుజాము వరకే పదుల సంఖ్యలో నేతలు, నిరుద్యోగులను వారి ఇండ్ల వద్దే అదుపులోకి తీసుకున్నారు. వారిని ఆయా పోలీస్ స్టేషన్లకు తరలించి సాయంత్రం వరకు విడిచిపెట్టలేదు. హైదరాబాద్‌కు వెళ్లే ప్రధాన రహదారులపైనా ప్రత్యేకంగా నిఘా పెట్టి అనుమానం వచ్చిన అదుపులోకి తీసుకున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి హైదరాబాద్‌కు వెళ్లకుండా అడ్డుకునేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టినా పోలీసుల కండ్లు గప్పి రాజధానికి చేరుకుని చలో సచివాలయం ముట్టడిలో పాల్గొన్నట్లు పలువురు నిరసనకారులు తెలిపారు. నిరుద్యోగుల సమస్యలపై శాంతియుతంగా ఉద్యమిస్తున్న యువత, నిరుద్యోగుల అరెస్టును వివిధ సంఘాల నేతలు తీవ్రంగా ఖండించారు. ఎన్నికల హామీ మేరకు జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగ యువత ఆకాంక్షలకు అనుగుణంగా ఉద్యోగాల భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. యువతను మోసం చేస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. మిర్యాలగూడలో చలో సచివాలయం కార్యక్రమానికి తరలివెళ్లేందుకు సిద్ధమైన బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ షోయబ్, సోషల్ మీడియా ఇన్‌చార్జి వడ్త్యా శివనాయక్‌తోపాటు పలువురిని టూటౌన్ పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిర్మలగిరి అశోక్‌తోపాటు పలువురిని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. దేవరకొండలో బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల రాజు, నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డుపల్లి కృష్ణను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. నార్కట్‌పల్లిలో బీఆర్‌ఎస్‌వీ నేత బొడిగె భరత్‌గౌడ్, దామరచర్లలో బీఆర్‌ఎస్‌వీ నాయకులు వినోద్‌నాయక్, దత్తునాయక్, రాము, బీజేవైఎం నేతలు నిమ్మల విజయ్, కృష్ణంరాజుతోపాటు పలువురి పోలీసులు అరెస్ట్ చేశారు. శాలిగౌరారం, తిర్మలగిరిసాగర్‌లోనూ బీఆర్‌ఎస్వీ నేతల అరెస్టులు సాగాయి. త్రిపురారంలో బీజేవైఎం నేతలను, మాడ్గులపల్లిలో డీవైఎఫ్‌ఐ నాయకులు పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురంలో బీఆర్‌ఎస్‌వీ మునుగోడు నియోజకవర్గ నాయకులు నలపరాజు రమేశ్, ఆడేపు సురేష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. మోత్కూర్‌లో కంచర్ల కాంత్రికుమార్‌తోపాటు పలువురిని అదుపులోకి తీసుకున్నారు. భూదాన్‌పోచంపల్లి, గుండాల, అడ్డగూడూర్‌లోనూ బీఆర్‌ఎస్‌వీ, పలువురు యువజన సంఘాల నేతల అరెస్టులు కొనసాగాయి. సూర్యాపేట జిల్లాకేంద్రంలో బీఆర్‌ఎస్‌వీ నేత సోమగాని వేణుగౌడ్‌తో పాటు పలువురిని రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పాలకీడులో యువజన సంఘం నేత పెరుమాళ్ల సతీశ్ ముందస్తు అరెస్టు చేశారు. నాగారంలో టీఆర్‌ఎస్‌వీ నాయకులు, తెలంగాణ గౌడ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొల్కపురి శ్రీకాంత్‌గౌడ్‌ను అదుపులోకి తీసుకున్నారు. నడిగూడెం, తుంగతుర్తితో పాటు పలుచోట్ల బీఆర్‌ఎస్‌వీ నేతలతోపాటు చలో సచివాలయానికి తరలివెళ్తారన్న అనుమానాలు ఉన్న ప్రతి ఒక్కరినీ ముందుగానే అదుపులోకి తీసుకుని సాయంత్రం వరకు పోలీసు స్టేషన్లలోనే నిర్బంధించారు.



సూర్యాపేట రూరల్ : బీఆర్‌ఎస్‌వీ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

## విశ్రాంత హోంగార్డు శ్రమదానం

నల్లగొండ సిటీ, జూలై 15 : నల్లగొండ పట్టణంలోని గొల్లగూడ 42వ వార్డు పరిధిలో బస్టాండ్ నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో రోడ్డుపై పెద్ద గుంత పడి కొద్దిరోజులుగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు, ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో విశ్రాంత హోంగార్డు మణెమ్మ శ్రమదానం చేసి పూడ్చారు. ఈ సందర్భంగా మణెమ్మ మాట్లాడుతూ రోడ్డుపై మోకాలోతు గుంతలు పడడంతో వర్షం వచ్చినప్పుడు వాహనదారులు గుంతలో పడిపోయి గాయాలయైనట్లు తెలిపారు. తాను హోంగార్డుగా విధుల్లో ఉన్నప్పుడు ఎంతో మంది ప్రాణాలు కోల్పోవడం చూశానని, అందుకే శ్రమదానం చేసి రోడ్డుపై గుంతను పూడ్చానని మణెమ్మ చెప్పుకొచ్చారు.



గుంతను పూడ్చుతున్న మణెమ్మ

## బీఈడీ విద్యార్థులకు మరో అవకాశం

**2011 నుంచి 2020 వరకు ఫెయిల్ అయిన విద్యార్థులకు వన్ టైమ్ పరీక్ష రాసే ఛాన్స్**

రామగిరి, జూలై 15 : మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ కళాశాలలో ఒక సంవత్సరం, రెండేండ్ల కోర్సు పూర్తి చేసి ఫెయిల్ అయిన బీఈడీ విద్యార్థులకు వర్సిటీ పరీక్షల విభాగం అధికారులు మంచి అవకాశం కల్పించారు. వారంతా పరీక్ష ఫీజు చెల్లించి రాసుకునేలా ఎంజీయూ పరీక్షల నియంత్రణాధికారి జి.ఉపేందర్‌రెడ్డి సోమవారం షెడ్యూల్ విడుదల చేశారు. 2011 - 2015 వరకు ఒక సంవత్సంలో బీఈడీ చదివి ఫెయిల్ అయిన వారు, 2015- 2020 సెమిస్టర్ విధానంలో రెండేండ్ల కోర్సు చదివి ఫెయిల్ అయిన వారు వన్ టైమ్ ఛాన్స్ కింద పరీక్ష ఫీజు చెల్లించి రాసుకోవచ్చు. ఈ నెల 30లోగా అపరాధ రుసుము లేకుండా, ఆగస్టు 1వరకు రూ. 200 అపరాధ రుసుముతో ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అన్ని పేపర్లకు రూ. 960, రెండు పేపర్ల వరకు రూ.660, అదనంగా పెనాల్టీతో ప్రతి పేపర్‌కు రూ. 1000 చెల్లించాలని, కళాశాలల యాజమాన్యాలు అధిక ఫీజు వసూలు చేస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని ఉపేందర్‌రెడ్డి హెచ్చరించారు.

# సర్కారులో మందుల్లేవ్

ప్రభుత్వాస్పత్రుల్లో మందుల కొరత !



**ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల కొరత వేధిస్తున్నది. సర్కారు నుంచి పలు రకాల మందుల సరఫరా కొద్దిరోజులుగా నిలిచిపోయింది. ముఖ్యంగా బీపీ, షుగర్, గ్యాస్, జలుబు, దగ్గు గోలీలు దొరుకడం లేదు. దాంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేసేది లేక ప్రైవేట్‌లో కొనుగోలు చేస్తున్నారు.**

– నీలగిరి, జూలై 15 /హాలియా/ శాలిగౌరారం

## పేదల వైద్యంపై నిర్లక్ష్యం

- అందుబాటులో లేని బీపీ, షుగర్, గ్యాస్ ట్యాబ్లెట్లు
- ప్రైవేట్ మెడికల్ హాల్స్‌లో రోగుల కొనుగోలు
- బీఆర్‌ఎస్ హయాంలో సక్రమంగా పంపిణీ
- రోజురోజుకూ పెరుగుతున్న సీజనల్ వ్యాధులు



నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

జిల్లా కేంద్ర దవాఖానతోపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఉప కేంద్రాలు, బస్తీ, పల్లె దవాఖానలు జిల్లాలో నడుస్తున్నాయి. వివిధ రకాల వ్యాధుల చికిత్స కోసం నిత్యం వేలాది మంది రోగులు వస్తుంటారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓపీల సంఖ్య కూడా పెరిగింది. వీరందరికీ ఉచితం వైద్యం చేయడంతోపాటు, మందులు అందించడం ప్రభుత్వ బాధ్యత. కానీ రోగులకు సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత నెలన్నరగా సరిపడా మందులను అందుబాటులో ఉంచడం లేదు. పలు రకాల మందులు ప్రభుత్వం నుంచి సరఫరా కావడం లేదు. ముఖ్యంగా బీపీ, షుగర్, గ్యాస్ సమస్యలకు సంబంధించిన మందు బిల్లలతో పాటు సీజనల్ వ్యాధులకు ఇచ్చే పలు మందులు దొరుకడంలేదని రోగులు చెబుతున్నారు. కొన్ని రకాల మందుల కోసం నేషనల్ హెల్త్ స్కీమ్ నుంచి నిధులు సమకూరుతాయి. ఇవి నేరుగా ఆయా పీహెచ్‌సీలకు జమ చేయగా.. అక్కడున్న అవసరాలకు అనుగుణంగా మందులను కొనుగోలు చేస్తారు. ఇది ప్రక్రియ సరిగ్గానే జరుగుతున్నట్లు తెలుస్తున్నది. కానీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే మందులు మాత్రం రావడంలేదు. ఉమ్మడి జిల్లాలోని మూడు జిల్లాలకు నల్లగొండ నుంచి సరఫరా అవుతాయి. ఇక్కడే సమస్య ఎదురవుతున్నది.

### ప్రైవేట్‌లో కొనుగోలు

ప్రభుత్వం సకాలంలో మెడిసిన్ సరఫరా చేయకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా షుగర్, బీపీ పేషెంట్లు నిత్యం ట్యాబ్లెట్లు వేసుకోవాల్సి ఉంటుంది. లేకపోతే శరీరం నియంత్రణ తప్పుతుంది. షుగర్ పెరుగడం, బీపీ పెరుగడం, తగ్గడం లాంటి పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంటుంది. ఆస్పత్రిల్లో ఈ మందులు లేకపోవడంతో కొందరు ప్రైవేట్ మెడికల్ షాపుల్లో కొనుగోలు చేస్తున్నారు. దాంతో రోగుల జేబులు గుల్ల అవుతున్నాయి. ఇంకొందరు కొనలేక ఉత్తగానే ఉండిపోతున్న పరిస్థితి నెలకొంది.

### గత ప్రభుత్వంలో సమయానికి మందులు

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో మాజీ సీఎం కేసీఆర్ జనం ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపించారు. మాజీ ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు దగ్గరుడిని స్పెషల్ ఫోకస్ పెట్టేవారు. ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. రోజురోజుకూ పరిస్థితి మారుతూ వస్తున్నది. ఇందుకు మందు గోలీల కొరతే తార్కాణం. సర్కారు దృష్టి పెట్టి.. సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

### పెరుగుతున్న విషజ్వరాలు

వర్షాకాలం కావడంతో సాధారణంగా సీజనల్ వ్యాధులు విజృంభిస్తాయి. ముఖ్యంగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులు ప్రబలుతుంటాయి. ప్రస్తుతం వర్షాలు భారీగా లేనప్పటికీ విషజ్వరాలు పెరుగుతున్నట్లు తెలుస్తున్నది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోజురోజుకూ రోగుల తాకిడి పెరుగుతున్నది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సీజనల్ వ్యాధులకు సంబంధించి అన్ని రకాల కిట్లు, పరీక్షలు అందుబాటులో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

### నల్లగొండ జిల్లా కేంద్రంలోనే దారుణం

వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు విజృభిస్తుండడంతో నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి జనాలు క్యూ కడుతున్నారు. ప్రతిరోజూ వెయ్యికి పైగానే రోగులు వస్తున్నారు. ఈ నెల 8నుంచి 13 వరకు ఆరు రోజుల్లో 7,483 మంది వివిధ రకాల వ్యాధులకు ఓపీ రోగులు వచ్చారు. వీరిలో 1,129 మందికి మాత్రమే మందులు ఇచ్చారు. అవి కూడా అరకొరే. మిగిలిన వారందరికీ మందులు లేవని చెప్పడంతో వారు ప్రైవేట్‌కు వెళ్లి తీసుకొస్తున్నారు. ఆపరేషన్ చేసిన మనుషులకు సైతం మందులు ఇవ్వడం లేదంటే ఆస్పత్రిలో మందుల కొరత ఎలా ఉందో అర్థమవుతున్నది. డెంగ్యూ, చికెన్‌గున్యావంటి వ్యాధులు వచ్చిన వారికి టెస్టులకు కిట్లు సరిపడా లేకపోవడంతో డాక్టర్లు మందులు రాసి ఇస్తున్నారు. కానీ ఆ మందులు కూడా అక్కడ ఉండడం లేదు. కలెక్టర్ నారాయణరెడ్డి ఆస్పత్రిపై ప్రత్యేక దృష్టి పెట్టినా మందుల కొరత మాత్రం అలాగే ఉన్నది.



నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఓపీ కోసం బారులుదీరిన జనం

### వారం రోజులుగా బయటే మందులు కొంటున్నా



నా భర్తకు నల్లగొండ ప్రభుత్వ దవాఖానలో వారం రోజుల కితం ఆపరేషన్ చేశారు. ఆ తర్వాత బయటకు తీసుకొచ్చి వార్డులో చేర్చారు. డాక్టర్లు వచ్చి చూసి మందులు రాస్తున్నారు. కానీ మందులు ఇవ్వడం లేదు. వార్డులో నర్సులను అడిగితే మా దగ్గర లేవు, ఫార్మసీకి వెళ్లి అడుగాలని చెబుతున్నరు. రోజూ ఫార్మసీకి వచ్చి అడుతున్నా ఇవి లేవని అంటున్నరు. ఎట్లా సారు అంటే రేపు మాపు వస్తాయని చెబుతున్నరు. ఆపరేషన్ అయిన మనిషికి ఎట్లా ఉంటదో ఏమో అని భయపడి వారం రోజుల నుంచి బయటనే మందులు తెచ్చుకుంటున్నాం. ఇప్పటికే మూడు వేల రూపాయలకు పైనే మందులు కొన్నా.

- దుర్గమ్మ, రోగి బంధువు, నల్లగొండ ప్రభుత్వ దవాఖాన

### బోదకాలుకు గోలీలు ఇయ్యట్లేరు

వారం రోజుల నుంచి కాళ్లనొప్పులు, ఒళ్లు నొప్పులు, జ్వరం, నీరసం వస్తుందని గవర్నమెంట్ దవాఖానకు వచ్చిన. డాక్టర్‌కు చూపించుకున్నంక మందులు రాసిండు. నొప్పుల గోలీలు, జ్వరం గోలీలు మాత్రమే ఇచ్చిండ్రు. కానీ బోదకాలు గోలీలు ఇయ్యట్లేరు. నాకు బోదకాలు గోలీలు వేసుకోకపోతే జ్వరం, నొప్పులు ఎక్కువ అయితయి. ఇప్పుడు ఈ గోలీలు వేసుకున్నా నొప్పులు తగ్గవు. బోదకాలు గోలీలు అడిగితే అయిపోయినయి అని చెప్పుండ్రు. దావఖానకు రెండు, మూడు మార్లు రావాలంటే చార్జీలు ఎక్కువ అయితున్నయ్. ఒక్కసారి గోలీలు ఇస్తే మళ్ల 15 రోజుల దాకా రాను. గోలీలు వచ్చేవారమన్న ఇస్తరో ఇయ్యరో మరి.

- జటంగి కొండమ్మ, నోముల, నకిరేకల్ మండలం



### ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తున్నది

వర్షాకాలం కావడంతో మా గ్రామంలో సీజనల్ వ్యాధులు వస్తున్నాయి. చూపించుకునేందుకు మండలంలోని ప్రభుత్వాస్పత్రికి వెళ్తే అక్కడ సరైన మందులు లేవు. ఉన్న మందులను ఇచ్చినా జ్వరాలు తగ్గడం లేదు. రోగులు చేసేదేమీ లేక మిర్యాలగూడ, నల్లగొండ పట్టణాలకు వెళ్లి ప్రైవేట్ ఆస్పత్రుల్లో చూపించుకోవాల్సి వస్తున్నది. వేలాది రూపాయలు ఖర్చు అవుతున్నాయి. పేదోళ్లమైన మా దగ్గర డబ్బులు లేక ప్రభుత్వాస్పత్రికి వెళ్తే అక్కడ సరిగా చూస్తలేరు.

- కుర్ర సంతు, అడవిదేవులపల్లి



### అవసరమైతే ఇండెంట్ పెట్టి తెప్పిస్తున్నాం



నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులకు సరపడా మందులు అందుబాటులో ఉన్నాయి. ఎలాంటి సమస్య లేదు. ఎప్పటికప్పుడు కలెక్టర్ పర్యవేక్షణ చేస్తున్నారు. ఏదైనా సమస్య వస్తే వెంటనే అయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నాం. మందులు అవసరమైతే ఇండెంట్ పెట్టి బయట నుంచి కొనుగోలు చేస్తున్నాం. సీజనల్ వ్యాధులు కావడంతో రోజూ రోగులు ఎక్కువ సంఖ్యలో వస్తున్నారు. రక్త, మూత్ర, ఇతర అన్ని రకాల పరక్షలు చేస్తున్నాం.

-నిత్యానందం, నల్లగొండ ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్

## అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి



మునుగోడులో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి క్యాంపు కార్యాలయం ఎదురుగా ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

మునుగోడు, జూలై 15 : అంగన్‌వాడీ టీచర్లకు రూ.ఐదు లక్షలు, ఆయాలకు రూ.రెండు లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య , మునుగోడు మండల కన్వీనర్ వరికుప్పల ముత్యాలు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం మునుగోడులోని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి క్యాంపు కార్యాలయం ఎదురుగా అంగన్‌వాడీలతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుకూలంగా వారి వేతనాలు చెల్లించాలని కోరారు. జీఓ నంబర్ పదిని రద్దుచేసి కొత్త జీఓ ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచుతామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా సమస్యలు పట్టించుకోవడంలేదని తెలిపారు. అంగన్‌వాడీ జిల్లా నాయకులు రజిత, శోభ, సువర్ణ, విజయలక్ష్మి, సులోచన, శారద, అరుణ, విమలాదేవి, మరియమ్మ పాల్గొన్నారు.

## రూ.11 లక్షల గుట్కా సీజ్

- నిషేధిత గుట్కా విక్రయిస్తే కఠిన చర్యలు
- సూర్యాపేట ఎస్పీ సన్ ప్రీత్ సింగ్



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

సూర్యాపేట టౌన్, జూలై 15 : నిషేధిత గుట్కా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని సూర్యాపేట ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ హెచ్చరించారు. సూర్యాపేట పట్టణంలో పోలీసుల తనిఖీల్లో ఆదివారం పట్టుబడిన సుమారు రూ.11 లక్షల విలువైన గుట్కా సీజ్ చేసిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసి సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్పీ తెలిపిన వివరాలు.. స్థానిక రాజీవ్‌నగర్‌కు చెందిన మాయదేవర శివసత్తి, పెన్‌పహాడ్ మండలం భక్తళాపురం గ్రామానికి చెందిన ఎర్రంశెట్టి నవీన్ ఇతర రాష్ట్రాల నుంచి నిషేధిత గుట్కాను తీసుకొచ్చి రెండు ఆటల్లో తరలిస్తుండగా శంకర్ విలాస్ సెంటర్‌లో ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఇరువురిని అదుపులోకి తీసుకొని విచారించగా వారికి సంబంధించిన కూరగాయ మార్కెట్‌లోని మంజూ బేకరీ అండ్ కిరాణ దుకాణంలో గుట్కా నిల్వ ఉంచి అక్కడి నుంచి విక్రయాలు జరుపుతామని ఒప్పుకున్నారు. దీంతో పోలీసులు దాడులు జరిపి గుట్కాను సీజ్ చేసి ఇరువురు రిమాండ్‌కు తరలించారు.

చాకచక్యంగా కేసును గుట్కా కేసును చేధించిన పట్టణ సీఐ జి. రాజశేఖర్, ఎస్ఐ మహేంద్రనాథ్, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎస్పీ రవి ఉన్నారు.